quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక

విలేకరులు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన వారికి మాత్రమే ప్రాధాన్యం.
తగిన గౌరవ వేతనం ఇవ్వబడును.

వివరాలకు వెంటనే సంప్రదించగలరు 8886460073 8125972476

www.quicktodaynews.com క్విక్ టుడే తెలుగు దినపత్రిక

EDITOR : GILLALA BUCHI REDDY | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 262 | ఆదివారం 16 జూన్ 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8

## మీరు తప్పుకోండి

### జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్‌కు కేసీఆర్ లేఖ



- చట్టబద్ధంగానే విద్యుత్ కొనుగోళ్లు
- తెలంగాణలో నిరంతర విద్యుత్ కోసం కృషి
- ఈఆర్‌సి నిబంధనలు కాదని కమిషన్ వేయడం చట్టవిరుద్ధం
- మా ప్రభుత్వానికి దురుద్దేశాలు అంటకట్టే ప్రయత్నాలు సరికాదు
- కమిషన్ ముందుకు వచ్చి వివరణ ఇవ్వాల్సిన పనిలేదు

హైదరాబాద్,జూన్15 క్విక్ టుడే : విద్యుత్ కొనుగోలు, పవర్ ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో అన్ని రకాల చట్టాలు, నిబంధనలు పాటిస్తూ ముందుకెళ్లామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర అనుమతులు సాధిస్తూ ముందుకెళ్లామని చెప్పారు. ఈఆర్సీ సంస్థలు వెలువరించిన తీర్పులపై కమిషన్లు వేయకూడదన్న విషయం కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. కమిషన్ చట్టవిరుద్ధమని ప్రభుత్వానికి సూచించకుండా బాధ్యతలు స్వీకరించడం విరుద్ధమని చెప్పారు. రాజకీయ కక్షతోనే విచారణ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. విద్యుత్ కొనుగోలు విషయంలో జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్‌కు కేసీఆర్ వివరణ ఇచ్చారు. ఈమేరకు కమిషన్‌కు 12 పేజీల లేఖ రాశారు.'రాష్ట్రం ఏర్పడినప్పుడు విద్యుత్ రంగం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. కరెంటు సరిగా లేక లక్షలాదిగా వ్యవసాయ పంపుసెట్లు కాలిపోయిన పరిస్థితి. పారిశ్రామిక రంగంలో ప్రతి వారంలో కొన్ని రోజులు పవర్ హాలిడే ప్రకటించారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు ఇచ్చిన కరెంటు ఏమాత్రం సరిపోదు. తెలంగాణ విద్యుత్ పంపిణీ వ్యవస్థ పటిష్ఠానికి నిర్మాణాత్మక చర్యలు తీసుకున్నాం. అన్ని రకాల అనుమతులు పొంది మందుకు పురోగమించడం జరిగింది. రాజకీయ కక్షతో తనను, అప్పటి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్జేయడానికే కమిషన్ వేశారు. మా ప్రభుత్వం గణనీయ మార్పుతో కరెంటు ఇచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. మా మార్పును తక్కువ చూపించేందుకే ప్రభుత్వ ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. పత్రికా విలేకఖరుల సమావేశంలో కమిషన్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడింది. విచారణ అనేది ఒక పవిత్రమైన బాధ్యత. ఇరుపక్షాల మధ్య మధ్యవర్తిగా నిలిచి నిజాలు నిగ్గుతేల్చాలి. అన్ని కోణాల్లో సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు వెల్లడించాలి. గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా రిపోర్టు ఇవ్వాలని మాట్లాడుతున్నట్లుంది. ఇప్పటికే నష్టం జరిగినట్లు.. ఆర్థిక నష్టాన్ని లెక్కిస్తున్నట్లు మీ మాటలు ఉన్నాయి. మీ విచారణలో నిష్పాక్షికత ఎంతమాత్రం కనిపించట్లేదు. నేను మీ ముందు హాజరై ఏం చెప్పినా ప్రయోజనం ఉండదు. మేం చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకుని వైదొలిగితే మంచిది. మీరు కమిషన్ బాధ్యల నుంచి వైదొలగాలని వినయ పూర్వకంగా కోరుతున్నా' అంటూ కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు. పరిస్థితులను గమనించే నాటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విద్యుత్తు అవసరాల దృష్ట్యా విభజన చట్ట ప్రకారం తెలంగాణకు ఇచ్చిన కరెంటు ఎంతమాత్రం సరిపోదు. 2014 నాటి వినియోగాన్ని బట్టి దాదాపు 2,700 మెగావాట్ల కొరత ఉంది.నాటి ఆంధ్రప్రదేశ్ కరెంట్ సరఫరాను ఎగవేయడం వల్ల 1,500 మెగావాట్లు, గ్యాస్ ఆధారిత విద్యుత్తు రాకపోవడం వల్ల 900 మెగావాట్లు కలిపి మరో 2,400 మెగావాట్ల లోటు ఏర్పడింది. మొత్తమ్మీద సుమారు 5,000 మెగావాట్ల కొరతతో తెలంగాణలోని విద్యుత్తు రంగంలో తీవ్ర సంక్షోభం ఏర్పడింది. విద్యుత్తు సంక్షోభం నుంచి గట్టెక్కడానికి శాశ్వత ప్రయోజనాలు కోసం విద్యుత్తు మిగతా 2వ పేజీలో..

## భారీగా కలెక్టర్ల బదిలీలు

### పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం

హైదరాబాద్, జూన్15 క్విక్ టుడే : తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ జరిగింది. 20 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొద్దిరోజులకు తాత్కాలిక బదిలీలు జరిపింది. గత ప్రభుత్వ హయాంలో పలు స్థానాల్లో ఉన్నవారిని మార్చింది. అనంతరం లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో బదిలీలు నిలిచిపోయాయి. ఎన్నికలు ముగియడంతో ప్రభుత్వం పాలనాపరమైన ప్రక్షాళనలో భాగంగా పెద్దఎత్తున మార్పులు చేసింది. వివిధ జిల్లాల కలెక్టర్లను బదిలే చేస్తూ కొత్తవారిని నియమిస్తూ ఆదేశాలు ఇచ్చింది. బదిలీ అయిన కలెక్టర్ల వివరాలు ఇలావున్నాయి. ఖమ్మం: ముజామిల్ ఖాన్, నాగర్‌కర్నూల్: సంతోష్, భూపాలపల్లి: రాహుల్‌శర్మ, కరీంనగర్: అనురాగ్ జయంతి, పెద్దపల్లి: కోయ శ్రీహర్ష, జగిత్యాల: సత్యప్రసాద్, మంచిర్యాల: కుమార్ దీపక్, మహబూబ్‌నగర్: విజయేంద్ర, హనుమకొండ: ప్రావీణ్య, నారాయణపేట్: సిక్తా పట్నాయక్, మిగతా 2వ పేజీలో..

## ఛత్తీస్‌ఘఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### ఒక భద్రతా సిబ్బంది సహా 8మంది నక్సల్స్ హతం

రాయపూర్, జూన్15 : ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపుర్‌లో మరోమారు ఎన్‌కౌంటర్ జరిగింది. ఎదురుకాల్పుల్లో 8 మంది నక్సలైట్లు, ఒక భద్రతా సిబ్బంది మృతిచెందారు. మరో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. అబుజ్‌మాడ్ అడవుల్లో ఇవాళ ఉదయం ఎన్‌కౌంటర్ మొదలైంది. నారాయణపుర్, కంకేర్, దంతేవాడ, కొండగావ్ జిల్లాలకు చెందిన భద్రతా దళాలు యాంటీ నక్సల్ ఆపరేషన్ చేపడుతున్న సమయంలో ఎదురుకాల్పులు జరిగినట్లు రాయ్‌పూర్ సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఇంకా అక్కడ ÷రిరగ్ నడుస్తున్నట్లు చెప్పారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, 53 బెటాలియన్ ఐటీబీపీకి చెందిన దళాలు జూన్ 12వ తేదీన కూంబింగ్ ఆపరేషన్ మొదలుపెట్టాయి. ఎన్‌కౌంటర్‌కు చెందిన మరిన్ని వివరాలు అందాల్సి ఉన్నది.

## జగన్‌కు ఝలక్

### జగన్ లోటస్‌పాండ్ ఇంటిముందు ఆక్రమణలు

### రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు కూల్చివేత



హైదరాబాద్,జూన్15క్విక్ టుడే : వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రేవంత్ సర్కార్ ఊహించని ఝలక్ ఇచ్చింది. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో జగన్ ఇంటి ముందు ఉన్న అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ కొరడా ఝులిపించింది. జగన్ ఇంటిముందు ఉన్న అక్రమ నిర్మాణాలను ఒక్కొక్కటిగా అధికారులు కూల్చివేస్తున్నారు. గతంలో జగన్ భద్రత కోసం రోడ్డును ఆక్రమించి మరీ గదులను సిబ్బంది నిర్మించడం జరిగింది. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగిస్తున్నారు. నివాసం ముందున్న అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారు. లోటస్ పాండ్ వద్ద అక్రమంగా నిర్మించిన పోలీస్ సెక్యూరిటీ షెడ్లను జీహెచ్‌ఎంసీ తొలగించింది. రహదారికి అడ్డుగా ఉన్నాయన్న ఫిర్యాదుతో జీహెచ్‌ఎంసీ అధికారులు మూడు షెడ్లను కూల్చేశారు. అక్రమ నిర్మాణాలు తొలగించాలని లోటస్ పాండ్ సిబ్బందికి జీహెచ్‌ఎంసీ, పోలీసులు నిన్ననే ఆదేశాలు జారీ చేశారు. రహదారి పక్కనే అక్రమ నిర్మాణాలతో రాకపోకలకు ఇబ్బంది మారిందని ఫిర్యాదు అందడంతో ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ అధికారులకు సామాన్య ప్రజలు, వాహనదారులు ఫిర్యాదులు చేశారు. ఈ వరుస ఫిర్యాదులో రంగంలోకి దిగిన అధికారులు కూల్చివేతలు ప్రారంభించారు. కాగా.. పోలీస్ బందోబస్తు మధ్య జగన్ ఇంటి ముందు నిర్మాణాలను అధికారులు కూల్చివేసారు.

## అంతా ఆయనే..

### మాకేం సంబంధం లేదు.. కేసీఆర్ చెప్పినట్టే చేశాం..

- మేడిగడ్డ వద్ద బ్యారేజ్‌ను కేసీఆరే సూచించారు
- తమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్‌ను సూచించాం
- జస్టిస్ ఘోష్ ముందు రిటైర్డ్ ఇంజనీర్ల వాదన



రిటైర్డ్ ఇంజనీర్లతో జస్టిస్ పినాకి చంద్రఘోష్ సమావేశం

హైదరాబాద్,జూన్15 క్విక్ టుడే : కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో నాటి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కర్త, కర్మ, క్రియ అని రిటైర్డ్ ఇంజనీర్లు తెలిపారు. మేడిగడ్డ వద్ద బ్యారేజ్‌ను కేసీఆర్ సూచించారని.. తమ్మిడిహట్టి వద్ద ప్రపోజ్ చేసినా దాన్ని పక్కకు పడేశారని ఇంజనీర్లు వాపోయారు. కాళేశ్వరం మిగతా 2వ పేజీలో..

## కర్ణాటక ప్రజలకు కాంగ్రెస్ షాక్

### పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్ పెంచిన ప్రభుత్వం



2

## సిక్కింలో భారీ వర్షం

### వరదల్లో చిక్కుకుపోయిన 1200 మంది టూరిస్టులు



2

## చట్టవిరుద్ధ పోడును అంగీకరించం

- అధికారులపై దాడులను క్షమించం
- అధికారులతో సమీక్షించిన మంత్రులు




హైదరాబాద్,జూన్15 క్విక్ టుడే : వ్యవసాయం పేరుతో పోడు చట్టాలకు విరుద్ధంగా పోడు భూములను సాగుచేసే వారిపై కఠిన చర్యలు తప్పవని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. పోడు రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, వారి ఉపాధికి భంగం కలుగకుండా, అటవీశాఖ మార్గదర్శకాలను అనుసరిస్తూ అధికారులు పోడు భూముల రక్షణకు కృషి చేయాలని ఆమె ఆదేశించారు. అదే సమయంలో పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతు కుటుంబాలు సున్నిత పరిస్థితుల్లో అటవీశాఖ అధికారులకు ఎలాంటి హాని మిగతా 2వ పేజీలో..

## ఆ ఆడియో, వీడియోలను తొలగించండి

అవి చట్టవిరుద్ధమని తేల్చిన కోర్టు .. కేజ్రీవాల్ సతీమణి సునీత కేజ్రీవాల్‌కు నోటీసులు

# మీరు తప్పుకోండి

మొదటి పేజీ తరువాయి..

పంపిణీ వ్యవస్థను పటిష్ఠపరచాం. ఫలితంగానే రాష్ట్రం ఆవిర్భవించినప్పుడు 7,778 మెగావాట్లుగా ఉన్న రాష్ట్ర స్థాపిత విద్యుత్తు, తర్వాత సుమారు
20,000 మెగావాట్లపైచిలుకుకు చేరింది. దేశంలోనే నాణ్యమైన నిరంతరాయ కరెంటు అన్ని రంగాలకూ సరఫరా చేసిన ఏకైక రాష్ట్రంగా మారింది. 2014 నాటికి తెలంగాణ తలసరి విద్యుత్తు వినియోగం 1,196 యూనిట్లు ఉండగా, పదళ్లలో అది 2,349 యూనిట్లకు పెరిగింది. ఈ విజయాలు ఆషామాషీగా సాధించలేదు. విద్యుత్తు కొనుగోళ్ల విధానంలో, నూతన విద్యుదుత్పత్తి కేంద్రాల ఏర్పాటులో చట్టాలను, నిబంధనలను పాటించాం. ఎలక్ట్రిసిటీ యాక్ట్ 2003ను అనుసరిస్తూ అవసరమైన అన్ని రకాల అనుమతులను పొంది ఎస్.ఇ.ఆర్.సి తీర్పులకు లోబడే చర్యలూ తీసుకున్నాం. దీనిపై అభ్యంతరాలు ఉంటే ఇ.ఆర్.సిలో ఫిర్యాదు చేయవచ్చు. దీనిపై తీర్పు నచ్చకుంటే అప్పిలేట్ ట్రైబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చు. ఛత్తీస్‌గఢ్ నుంచి రాష్ట్ర విద్యుత్తు సంస్థలు కరెంటు కొనుగోలు చేయడంపై నాటి తెలుగుదేశం ఎమ్మెల్యేగా రేవంత్ రెడ్డి తెలంగాణ ఇ.ఆర్.సికి అభ్యంతరాలు చెప్పారు. వాటిని పరిశీలించిన తర్వాతే తెలంగాణ విద్యుత్తు సంస్థలు చేసిన ప్రతిపాదనలకు ఇ.ఆర్.సి. ఆమోదముద్ర వేసింది. అప్పుడు అభ్యంతరం ఉండి ఉంటే అప్పిలేట్ ట్రైబ్యునల్ కు లేదా ఇతర కోర్టులకు వెళ్లే స్వేచ్ఛ ఉంది. కానీ ఆయన ఆనాడు ఎలాంటి అప్పీలుకూ వెళ్లిన దాఖలాలు చేయలేదు. రేవంత్రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యుత్తు విజయాలను సాధించిన గత ప్రభుత్వానికి దురుద్దేశాలను ఆపాదిస్తూ శ్వేతపత్రాలు విడుదల చేశారు. వాటిపై చర్చలు జరిగాయి. రెగ్యులేటరీ సంస్థల తీర్పులపై విచారణ చేయొద్దన్న ఇంగితం లేకండా కమిషన్ ఏర్పాటు చేశారు. హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన వ్యక్తి కూడా న్యాయ ప్రాధికార సంస్థల తీర్పులపై ఎంక్వైరీ చేయొద్దని సూచించకుండా బాధ్యతలు స్వీకరించడం విచారకరం. చట్టవిరుద్ధంగా విచారణ ప్రారంభించి, అనేక విషయాలను సమగ్రంగా పరిశీలించకుండానే, పరిగణనలోకి తీసుకోకుండానే పలు అంశాలపై అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారు. నా అభ్యంతరాలను మీకు తెలియజేస్తున్నానని కెసిఆర్ తన లేఖలో వివరించారు.

## చట్టవిరుద్ధ పోడును అంగీకరించం

మొదటి పేజీ తరువాయి..

తలపెట్టవద్దని, ఆపై క్రమశిక్షణ చర్యలకు గురికావద్దని హెచ్చరిక చేశారు. శనివారం సచివాలయంలో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో పోడు భూముల సమస్యలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ప్రసాద్, అడిషనల్ సెక్రెటరీ ప్రశాంతి, డిప్యూటీ సెక్రెటరీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పోడు రైతుల హక్కులను కాపాడటంలోనూ, అదే సమయంలో అటవీశాఖ భూములను కాపాడే అధికారులకు రక్షణ కల్పించడంలోనూ ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగుతున్నదని మంత్రి సురేఖ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఏళ్లుగా పోడు భూములను సాగుచేసుకుంటున్న రైతు కుటుంబాల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని, వ్యవసాయం పేరుతో మార్గదర్శకాలకు, చట్టాలకు విరుద్ధంగా కొత్తగా పోడు భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు చేపట్టాల్సి వస్తుందని మంత్రి హెచ్చరించారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కాల్పోల్ గ్రామంలో ఎఫ్ఆర్ఓ, సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్లపై గిరిజనులు చేసిన దాడిని ఆమె ప్రస్తావించారు. ప్రజల ప్రయోజనాలకు ఎంత ప్రాధాన్యం ఇస్తామో.. రాష్ట్ర అటవీ సంపద, సహజ వనరుల పరిరక్షణకు అంతే ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

## భారీగా కలెక్టర్ల బదిలీలు

మొదటి పేజీ తరువాయి..

సిరిసిల్ల: సందీప్‌కుమార్ ఝా, భద్రాద్రి కొత్తగూడెం: జితేష్ వి పాటిల్, వికారాబాద్: ప్రతీక్ జైన్, కామారెడ్డి: ఆశిష్ సంగ్వాన్, నల్గొండ: నారాయణరెడ్డి, వనపర్తి: ఆదర్శ్ సురభి, సూర్యాపేట కలెక్టర్: తేజస్ నందలాల్ పవార్, వరంగల్: సత్య శారదాదేవి, ములుగు: దివాకరా, నిర్మల్: అభిలాష అభినవ్ ఉన్నారు. ఈ బదిలీల్లో పలువురు కలెక్టర్లను మార్చారు. సుమారుగా 20 జిల్లాలకు కలెక్టర్లను బదిలీ చేశారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్‌ను ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా, మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా, ట్రాన్స్‌కో జేఎండీ సందీప్ కుమార్ ఝాను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా, అనురాగ్ జయంతిని కరీంనగర్ జిల్లా కలెక్టర్గా, నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌ను కామారెడ్డిజిల్లా కలెక్టర్‌గా, జితేష్ వి పాటిల్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా, రాహుల్ శర్మను జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా, హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా, పీ ప్రావీణ్యను వరంగల్ జిల్లా కలెక్టర్ నుంచి హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా, సత్యప్రసాద్‌ను ఖమ్మం అదనపు కలెక్టర్ నుంచి జగిత్యాల కలెక్టర్‌గా బదిలీ చేశారు. కోయ శ్రీహర్షను పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా, విజయేంద్ర బోయిని మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా, కుమార్ దీపక్‌ను మంచిర్యాల కలెక్టర్‌గా, ప్రతీక్ జైన్‌ను వికారాబాద్ కలెక్టర్‌గా, నారాయణరెడ్డి వికారాబాద్ కలెక్టర్‌గా, ఆదర్శ సురభిని వనపర్తి జిల్లా కలెక్టర్‌గా, తేజస్ నంద్‌లాల్‌ను సూర్యాపేట జిల్లా కలెక్టర్‌గా, సత్య శారదాదేవిని వరంగల్ జిల్లా కలెక్టర్‌గా, దివాకర్‌ను ములుగు జిల్లా కలెక్టర్‌గా, అభిలాష అభినవ్‌ను నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

### ప్రజలకు కర్నాటక

## కాంగ్రెస్ షాక్

### పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్ పెంచిన ప్రభుత్వం

బెంగళూరు,జూన్15 : వాహనదారులకు కర్నాటకలో కాంగ్రెస్ సర్కారు షాకిచ్చింది. లోక్‌సభ ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. ఈ మేరకు పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్ పెంచినట్టు కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారు శనివారం మధ్యాహ్నం నోటిఫికేషన్ విడుదల చేసింది. కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాహనదారులకు గట్టి షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్‌పై రాష్ట్ర పరిధిలోని సేల్స్ ట్యాక్స్‌ను పెంచింది. దీంతో వీటి ధరలు రూ.3 మేర పెరిగాయి. ఈ పెంపు తక్షణమే అంటే శనివారం నుంచే అమల్లోకి వస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. ఈమేరకు శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పెట్రోల్‌పై కర్ణాటక సేల్స్ ట్యాక్స్‌ను 25.92శాతం నుంచి 29.84శాతానికి పెంచారు. ఇక, డీజిల్‌పై అమ్మకం పన్నును 14.3 శాతం నుంచి 18.44 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. తాజా పెంపుతో రాష్ట్రంలో లీటర్ పెట్రోల్ ధర రూ.3, డీజిల్ ధర రూ.3.05 మేర పెరుగుతున్నట్లు కర్ణాటక పెట్రోలియం డీలర్స్ అసిసోయేషిన్ తెలిపింది. దీంతో బెంగళూరులో లీటర్ పెట్రోల్ ధర రూ.102.86, డీజిల్ ధర రూ.88.94కు చేరింది. ఈ పెంపుతో రాష్ట్ర ఖజానాకు ఏటా రూ.2,500–2,800 కోట్ల మేర ఆదాయం సమకూరనున్నట్లు కర్ణాటక ఆర్థికశాఖ వర్గాలు చెబుతున్నాయి. చివరిసారిగా రాష్ట్రంలో 2021 నవంబరులో అప్పటి భాజపా సర్కారు పెట్రోల్, డీజీల్ ధరలను సవరించింది. కొవిడ్ తర్వాత ప్రజలకు ఊరట కల్పించేందుకు పెట్రోల్‌పై రూ.13.30, డీజిల్‌పై రూ.19.40 మేర తగ్గించింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ధరలను సవరించడం మళ్లీ ఇప్పుడే. కాగా.. లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన వెంటనే చమురు ధరల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గమనార్హం.ఈ పెంపు తక్షణమే అమల్లోకి వస్తుందని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ప్రభుత్వ నోటిఫికేషన్ అందుకున్న 'అఖిల కర్ణాటక ఫెడరేషన్ ఆఫ్ పెట్రోలియం ట్రేడర్స్'.. నోటిఫికేషన్‌కు అనుగుణంగా పెట్రో రేట్లను సవరించినట్లు వెల్లడించింది.

## సిక్కింలో భారీ వర్షం..

### వరదల్లో చిక్కుకుపోయిన 1200 మంది టూరిస్టులు

సిక్కిం,జూన్15 : సిక్కింలో భారీ వర్షాలు బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. ప్రకృతి అందాలను చూసేందుకు వెళ్లిన పర్యాటకులు వరదల్లో చిక్కుకుపోయారు. నార్త్ సిక్కింలో 22 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తీస్తాలో వరదలు సంభవించడంతో.. 1200 మంది స్వదేశీ, విదేశీ పర్యాటకులు లాచుంగ్ ప్రాంతంలో చిక్కుకుపోయారు. వర్షాలు తగ్గుముఖం పట్టి.. వాతావరణం అనుకూలించాక పర్యాటకులను తరలించే ఏర్పాట్లు చేస్తామని స్థానిక అధికారులు తెలిపారు. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగి పడటంతో.. ఇళ్లలోకి భారీగా వరదనీరు చేరి నీటమునిగాయి. ఇక భారీ వర్షాలు, వరదలు కొట్టుకుపోయిన, డ్యామేజ్ అయిన రోడ్ల మరమ్మతులకు కనీసం 5–6 రోజుల సమయం పడుతుందన్నారు. ఇప్పటి వరకూ సిక్కింలో వర్షాల కారణంగా ఆరుగురు మరణించారని, వారిలో ముగ్గురి మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయని పేర్కొన్నారు. సంక్లాంగ్ లోని వంతెన వరదనీటిలో కొట్టుకుపోవడంతో.. చుంగ్తాంగ్, లాచుంగ్ ప్రాంతాల నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో చిక్కుకున్న పర్యాటకులను ప్రత్యేక విమానంలో తరలించేందుకు కేంద్రంతో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లను వీలైనంత త్వరగా మరమ్మతు చేయాలని ఆదేశించారు.

## ఎన్టీఆర్ భవన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి,జూన్15 క్విక్ టుడే : ఏపీ సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి ఆయన మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో అడుగుపెట్టారు. దీంతో టీడీపీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం ఫలికారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు, నేతలు ఎన్టీఆర్ భవన్ వద్దకు రావడంతో పరిసర ప్రాంతాల వద్ద సందడి నెలకొంది. జై చంద్రబాబు, చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పలువురు నేతలు సీఎంకు పూల బొకేతో స్వాగతం పలికారు. ఇక నుంచి తరుచూ చంద్రబాబు పార్టీ కార్యాలయానికి వెళ్లనున్నట్లు సమాచారం. భవిష్యత్తులో సీఎం పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లనున్నారని తెలుస్తోంది. జిల్లాలోని పార్టీ కార్యాలయాలను సైతం సందర్శించాలని మంత్రులు, నేతలను ఇదివరకే సీఎం చంద్రబాబు ఆదేశించారు. నాకు ప్రజలకు మధ్య అడ్డుగోడలు ఉండటానికి వీల్లేదు.. ప్రజల సమస్యలు, వినతుల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చంద్రబాబు అన్నారు.

## అంతా ఆయనే..

మొదటి పేజీ తరువాయి..

ప్రాజెక్టుపై 2015లో వేసిన అనంతరాములు కమిటీలోని రిటైర్డ్ ఇంజనీర్లతో జస్టిస్ పినాకి చంద్రఘోష్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఇంజనీర్లు కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి కీలకమైన సమాచారాన్ని అందించారు. అనంతరాములు కమిటీ రిపోర్టును పట్టించుకోలేదని అన్నారు. రిపోర్టును అప్పటి ఇరిగేషన్ మినిస్టర్ హరీష్ రావు కేసీఆర్‌కు అందించినా తాను సంతకం చేయకుండా ఓ మూలన పడేశారని వాపోయారు. అనంతరం జస్టిస్ ఘోష్ స్పందించారు. తాను పిలిస్తే ఎవరైనా విచారణకు రావాల్సిందేనని తేల్చిచెప్పారు. విచారణకు రాకపోతే తనకు ఏం చేయాలో తెలుసన్నారు. రిటైర్డ్ ఇంజనీర్లతో సమావేశమైన ఘోష్ కాళేశ్వరం ప్రాజెక్టులోని సబ్ క్రాంటాక్ట్ వ్యవస్థపై ఆరా తీశారు. కాంట్రాక్ట్ ఏజెన్సీల అకౌంట్స్, బ్యాంక్ స్టేట్‌మెంట్స్ పరిశీలించే యోచనలో ఉన్నారు. వీటితో పాటు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ నుంచి డేటా తీసుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఆ అకౌంట్ల లెక్కలు చూస్తే అసలు విషయం బయట పడుతుందని.. ఎంత మొత్తం చేతులు మారాయనేదానిపై స్పష్టత వస్తుందన్నారు.ఇప్పటివరకు 10 నుంచి 15 సబ్ కాంట్రాక్ట్‌లు ఇచ్చారని ఘోష్ నేతృత్వంలోని కమిషన్ వాటి వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఇప్పటికే అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించిన కమిషన్.. అవి పరిశీలించాక అవసరమైతే సీడబ్ల్యూసీ వారిని పిలుస్తామన్నారు ఘోష్. ఇక ఏఈఈ, డీఈఈలను విచారించాలా లేదా అనేదానిపై తర్వాత తెలుపుతామన్నారు. ప్రస్తుతానికి ఇంజనీర్లతో సమావేశం ముగిసిందని అఫిడవిట్లు వచ్చాకే తదుపరి విచారణ అంటూ జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ స్పష్టం చేశారు.

### ఆ ఆడియో, వీడియోలను

## తొలగించండి

### అవి చట్టవిరుద్ధమని తేల్చిన కోర్టు

### కేజీవ్రాల్ సతీమణి సునీత కేజీవ్రాల్‌కు నోటీసులు

న్యూఢిల్లీ,జూన్15 : ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్ సతీమణి సునీత కేజీవ్రాల్ కు ఢిల్లీ కోర్టు నోటీసులు జారీచేసింది. మార్చి 28న అరవింద్ కేజీవ్రాల్ కోర్టులో మాట్లాడుతున్న దృశ్యాలు,ఆడియో రికార్డులను ఆమె తన సోషల్ మీడియా ఖాతాల నుంచి తొలగించాలని ఆదేశించింది. అలాగే అవి ఎక్కడున్నా తీసివేయాలంటూ ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికలకు ఆదేశాలు ఇచ్చింది. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరవింద్ కేజీవ్రాల్ అరెస్టయిన సంగతి తెలిసిందే. ఆ కేసు విచారణలో భాగంగా మార్చి 28న ఆయన వ్యక్తిగతంగా హాజరై స్వయంగా వాదనలు వినిపించారు. ఆప్‌ను ఒక అవినీతి పార్టీగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్నారని ఆ సందర్భంగా ఆరోపించారు. ఆ వాదనకు సంబంధించిన ఆడియో/వీడియోను ఆప్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు సోషల్ మీడియాలో పోస్టు చేశాయంటూ ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. అలా విచారణలను రికార్డు చేయడం 'హైకోర్టు ఆఫ్ ఢిల్లీ రూల్స్ ఫర్ వీడియో కాన్ఫరెన్సింగ్ ఫర్ కోర్ట్స్(2021)' నిబంధనల ప్రకారం నిషిద్ధమంటూ ఆ పిటిషనర్ వాదించారు. వీటిని వైరల్ చేయడం ద్వారా న్యాయవ్యవస్థ, న్యాయమూర్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు యత్నించారని వెల్లడించారు. ఇదంతా ఆప్, అరవింద్ కేజీవ్రాల్ కుట్రలో భాగమని ఆరోపించారు. ఈ నిబంధనలు ఉల్లంఘించినందుకు చర్యలు తీసుకోవాలంటూ కోరారు. ఒక 'ఎక్స్' యూజర్ అప్‌లోడ్ చేసిన ఆడియో రికార్డింగ్‌ను సునీత కూడా తన సోషల్ మీడియా ఖాతాల్లో రీపోస్టు చేశారు. ఈ నేపథ్యంలో సదరు పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. వాటిని తొలగించాలంటూ సునీతతో పాటు సోషల్ మీడియా సంస్థలకు నోటీసులు జారీ చేసింది. ఇదిలా ఉంటే.. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజీవ్రాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దానిపై విచారణ ఆలస్యమవుతుండటంతో ఎన్నికల్లో ప్రచారం కోసం చేసిన అభ్యర్థనను అంగీకరిస్తూ.. కోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు జూన్ 2న తిరిగి జైలు అధికారుల ముందు లొంగిపోయారు. ప్రస్తుతం ఆయన తిహార్ జైల్లో ఉన్నారు.

### నిబంధనలు, నాణ్యత

## ప్రమాణాలు పాటించాల్సిందే

**నిర్లక్ష్యంతో ఫుడ్ వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు**

**రాష్ట్ర వ్యాప్తంగా బృందాలు నిరంతరం ఆహార తనిఖీ**

**మొబైల్ ఫుడ్ లాబ్స్ ద్వారా ఆహార పదార్థాల టెస్టులు**

**తయారుదారులు లైసెన్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి**

**ఫుడ్ సేఫ్టీలో తెలంగాణ ఆదర్శంగా నిలవాలి**

**వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**ఫుడ్ సేఫ్టీపై ఉన్నత స్థాయి సమీక్ష**

హైదరాబాద్,జూన్15 క్విక్ టుడే : ఫుడ్ సేఫ్టీపై ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ పై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో దామోదర్ రాజనర్సింహ అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంతో ఫుడ్ వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆహార తనిఖీ బృందాలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఫుడ్ లాబ్స్ ద్వారా సుమారు 180 నుంచి 200 ఫుడ్ శాంపిల్స్ లను టెస్టులు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ హాస్టల్స్, ప్రైవేటు బోర్డింగ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లు, బేకరీలు, డెయిరీ ఫుడ్ తయారీదారులు, రెస్టారెంట్లు, ప్యాకేజ్డ్ ఫుడ్ తయారుదారులు లైసెన్స్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఉపేక్షించేది లేదని మంత్రి దామోదర్ రాజనర్సింహ హెచ్చరించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్ %-% 2006 ప్రకారం నాణ్యత ప్రమాణాలు పాటించని ఫుడ్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. టాస్క్ ఫోర్స్ , ఫుడ్ సేఫ్టీ అన్ వీల్స్ (ఫుడ్ లాబ్స్), ఆకస్మిక తనిఖీలు, అవగాహన సదస్సులను నిరంతరం నిర్వహించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల పనితీరు పై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.కాగా.. మనం తీసుకునే ఆహారం నాణ్యత లోపం ఉంటే అనారోగ్య సమస్యలు మన దరికి చేరుతాయి. ఇటీవల కాలంలో ఎక్కువగా భోజనప్రియులు బయటి హోటల్, రెస్టారెంట్లలో భుజించేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నటువంటి పరిస్థితి. ఫ్రిజ్ లలో అందిస్తున్న తీరును అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.






## భద్రాద్రికి కొత్త కలెక్టర్ జితేష్ వి పాటిల్

### డాక్టర్ ప్రియాంక అల బదిలీ



భద్రాద్రి కొత్తగూడెం జూన్ 15(క్రికెట్ టుడే): తెలంగాణ వ్యాప్తంగా జరిగిన కలెక్టర్ల బదిలీలలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన డాక్టర్ ప్రియాంక అల బదిలీ కావడం జరిగింది. భద్రాద్రి జిల్లాకు కొత్త కలెక్టర్ గా జితేష్ వి పాటిల్ రానున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

## గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలి

### ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

### సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఫైళ్ళ ఆశయ్య



చెన్నూర్, జూన్ 15, క్విక్ టుడే న్యూస్ : చెన్నూరు మండలం రాజన్న కాలనీలో గుడిసె వాసుల జనరల్ బాడీ సమావేశంలో నాగజ్యోతి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య గారు హాజరై మాట్లాడుతూ పేదలు 14 నెలలుగా ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని పోరాటం చేస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ అక్కడే నివసిస్తూ,నిత్యం గుడిసెల నుంచి పనులకు వెళు తున్నారని,గత ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదని,ఇప్పుడున్న ప్రభుత్వం గుడిసె వాసులకు పట్టాలు ఇచ్చి,ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.బోడంకి చందు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ నిరుపేదలు గుడిసెల్లో వర్షానికి,ఎండకు,చలికితట్టుకొని గుడిసె వేసుకొని అక్కడే నివసిస్తూ,అనేక ఇబ్బందులు పడుతున్నారని,ప్రభుత్వం కనీసం మౌలిక సదుపాయాలు బోర్లు,కరెంటు,రోడ్డు నిర్మించి ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమ%శీ%లో గుడిసెల పోరాట కమిటీ సభ్యులు ఉమారాణి, నవ్మక్క,నరిత,చంద్రన్న,కుమార్,రాజేశ్వరి,రేణుక,నహాన బేగం,బుధఅక్క,రమాదేవి,జమున,శ్రావణ్,యామిని,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ఐ కుటుంబానికి భద్రత చెక్కును అందజేసిన కమిషనర్



హైదరాబాద్, క్విక్ టుడే న్యూస్ : రాచకొండ కమిషనరేట్ పరిధిలోని యాచారం పోలీస్ స్టేషన్ లో పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏఎస్ఐ జంగయ్య గారి కొడుకులు ప్రవీణ్ కుమార్, సందీప్ కుమార్ లకు కమిషనర్ శ్రీ తరుణ్ జోషి ఐపీఎస్ గారు ఏడు లక్షల తొంభైమూడు వేల ఎనిమిది వందల తొంబై ఎనిమిది రూపాయల భద్రత చెక్కును అందజేసినారు. వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు భద్రా రెడ్డి మరియు ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల జాతర నిర్వహణ

### ఏర్పాట్లపై సమీక్షించిన మంత్రులు

హైదరాబాద్, జూన్15 క్విక్ టుడే న్యూస్ : వచ్చే నెల జూలైలో జరగబోయే బోనాల జాతరను ఘనంగా జరిపించేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతుంది. జూబ్లీహిల్స్ ఎంసీహెచ్ఆర్ డిలో బోనాల పండుగ ఏర్పాట్లపై రివ్యూ మీటింగ్ జరిగింది. ఆషాఢ మాసం బోనాలు పండుగ ఘనంగా ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వం అన్ని శాఖలతో మీటింగ్ జరిగింది. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు దిశానిర్ధేశర చేశారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి , రాజ్యసభ సభ్యులు అనిల్ యాదవ్ ,వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఆషాఢ మాసం బోనాల జాతర ను విజయవంతం చేసుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలు , శాంతి భద్రతలు ,దేవాలయాల వద్ద భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లు తదితర అంశాల పై సమీక్షా సమావేశంలో చర్చించారు.

## తెలుగు ఐఏఎస్ కృష్ణతేజకు జాతీయ పురస్కారం

### అభినందించిన డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

అమరావతి, జూన్15 క్విక్ టుడే న్యూస్ : తెలుగు ఐఏఎస్ కృష్ణతేజకు ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభినందనలు తెలిపారు. జాతీయ బాలల రక్షణ కమిషన్ పురస్కారానికి ఆయన ఎంపిక కావడం హర్షణీయమని తెలిపారు. మరిన్ని సేవలందిస్తూ ఉద్యోగులు, యువతకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కృష్ణతేజ త్రిస్సూర్ కలెక్టర్‌గా పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ఆయన ఉత్తమ విధానాలు అనుసరించారని గుర్తుచేశారు. కరోనా, కేరళ వరదల విపత్తుల సమయంలో ఆయన అందించిన సేవలను ప్రజలు మరచిపోలేదని పవన్ తెలిపారు. తెలుగుతేజం, ఐఏఎస్ అధికారి ఎం.వి.ఆర్.కృష్ణతేజకు జాతీయ పురస్కారం లభించింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన ఆయన కేరళ రాష్ట్రం త్రిసూర్ జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్నారు. బాలల హక్కుల రక్షణలో దేశంలోనే త్రిసూర్ జిల్లాను అగ్రగామిగా నిలపడంతో జాతీయ బాలల హక్కుల కమిషన్ పురస్కారానికి ఎంపికయ్యారు. 27న దిల్లీలో ఈ అవార్డును అందుకోనున్నారు. 2015 బ్యాచ్ ఐఏఎస్ అయిన కృష్ణతేజ 2023 మార్చిలో కేరళ రాష్ట్రం త్రిసూర్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

# సీనియర్ సిటిజన్స్ కోసం సైబర్ సేఫ్టీ వర్క్‌షాప్

### రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



హైదరాబాద్, క్విక్ టుడే : రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ (ఆర్ కేఎస్‌సీ) ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ ఫోరమ్ సైనిక్‌పురిలోని ఏఎఫ్‌ఓసీహెచ్ఎస్ లో సీనియర్ సిటిజన్‌ల కు సైబర్ భద్రతపై అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్ నిర్వహించడం జరిగింది. డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండటానికి అవసరమైన జ్ఞానం మరియు నైపుణ్యాలను వృద్ధులకు అందించడం ఈ ఈవెంట్ లక్ష్యం. ఆన్‌లైన్ స్కామ్‌లను గుర్తించడం మరియు నివారించడం, సోషల్ మీడియాలో గోప్యతకు సంబంధించిన రక్షణ పద్ధతులను, సెట్టింగ్‌లను అర్థం చేసుకోవడం, బలమైన పాస్‌వర్డ్‌లను ఏర్పాటు చేసుకోవడం మరియు ఫిషింగ్ ప్రయత్నాలను గుర్తించడం వంటి ముఖ్య అంశాల మీద ఈ వర్క్ షాప్ లో పరిజ్ఞానం కల్పించడం జరిగింది. డిజిటల్ సేఫ్టీ నిపుణులు మరియు వక్తలు శ్రీ కరుణాకర్, ఏసీపీ ఆంజనేయులు, ఇన్‌స్పెక్టర్ సైబర్ క్రైమ్స్, శివ కర్ది, సెక్రటరీ, సైబర్ సెక్యూరిటీ ఫోరమ్, లు హాజరైనవారితో ప్రశ్నోత్తరాల కార్యక్రమం ద్వారా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం మాత్రమే కాకుండా వారి అనుభవాలను పంచుకోవడంతో పాటు ఎన్నో విలువైన సూచనలు అందించారు. ఈ వర్క్‌షాప్ లో పాల్గొన్న వారికి డిజిటల్ ప్రపంచంలో సురక్షిత విధానాల గురించి మరియు సైబర్ భద్రత అప్రమత్తత యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సైబర్ భద్రత సమాచారం యొక్క అవసరం మరియు పలురకాల అంతర్జాల మోసాలకు సంబంధించిన పరిజ్ఞానం పట్ల ఆహుతులు హర్షం వ్యక్తం చేశారు. వయోవృద్దుల్లో డిజిటల్ అక్షరాస్యతను మెరుగుపరచడానికి మరియు పౌరుల ఆన్‌లైన్ భద్రతను పెంచడానికి రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ యొక్క నిరంతర ప్రయత్నంలో ఈ కార్యక్రమం ఒక ముఖ్య భాగం. వయోవృద్దుల్లో డిజిటల్ భద్రత మీద అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని శ్రీ తరుణ్ జోషి, ఐపీఎస్, కమీషనర్ ఆఫ్ పోలీస్, రాచకొండ., మరియు ఆర్ కేఎస్‌సీ ఛైర్మన్ అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ గారు మాట్లాడుతూ రోజురోజుకూ పెరిగిపోతోన్న సైబర్ నేరాల గురించి ప్రజల్లో ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించాల్సిన ఉందని పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ ఫోరం ద్వారా పాఠశాల మరియు కళాశాల విద్యార్థుల కోసం ఇలాంటి సెషన్‌లు మరిన్ని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ కేఎస్‌సీ జనరల్ సెక్రటరీ డాక్టర్ రఘువీర్ మాట్లాడుతూ రాచకొండ పరిధిలోని అన్ని విద్యా సంస్థలలో డిజిటల్ భద్రత మీద అవగాహన సదస్సులను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సైబర్ యోధా కోఆర్డినేటర్ శ్రీ విక్రమ్, ఆర్ కేఎస్‌సీ చీఫ్ కోఆర్డినేటర్ శ్రీమతి సావిత్రి గార్ల సమన్వయంతో నిర్వహించడం జరిగింది.

# పేద ప్రజల పక్షపాతి ఎమ్మెల్యే కూనంనేని

### ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్

### సందడిగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు




భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో జూన్ 15(క్విక్ టుడే) : కార్మిక కర్షక పేద ప్రజల పక్షపాతి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అని ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా ఆయనను రైటర్ బస్తీలో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం అభ్యుదయ కళా సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మద్దెల మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధి కోసం దేశ రాజకీయాల్లో కూడా లౌకికవాదం ప్రజాస్వామిక విలువల పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వానికే సలహాలనిస్తూ ముందుకు పోతున్న వ్యక్తి కూనంనేనని కొనియాడారు. అదేవిధంగా అభ్యుదయ వాది అభిమాన పాత్రుడు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషాని కూడా పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ ఆత్మీయ అభినందన కార్యక్రమంలో శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి యంగ్ అండ్ డైనమిక్ లీడర్ ఎస్ కే సాబీర్ పాషా, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ లతోపాటు , సంఘ గౌరవ సలహాదారులు రిటైర్డ్ సింగరేణి జిఎం అందెల ఆనందరావు, సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, సంఘ గౌరవాధ్యక్షులు స్వర సంగీత విద్వాన్ కలవల రాందాస్, అంబేద్కర్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా హనుమంతు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జోసెఫ్ రవికుమార్, రాష్ట్ర ఆర్గనైజర్ స్టీవెన్ లాజరస్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు తోత సల్మాన్ ఖాన్, సంఘ రాష్ట్ర నాయకురాళ్లు మునీల, బడికెల పుష్పలత, కొచ్చర్ల కమలా రాణి, కల్పన, అంబేద్కర్ సంఘ యూత్ నాయకులు మద్దెల ఆదర్శ్, మద్దెల సాయి సుధీర్, కేదాసి కిరణ్, సుమన్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

# పట్టాలున్నా పోడు భీడు పోతుంది

### ఫారెస్ట్ అధికారుల తీరుపై ఆదివాసీ నేత ఎర్మ పున్నం ఆగ్రహం

### పట్టాలున్న పోడు భూములకు సర్వ హక్కులు కల్పించాలని వినతి

### ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నాకు పిలుపు



చెన్నూర్, జూన్ 15.క్విక్ టుడే న్యూస్ : పోడు భూములకు పట్టాలు ఉన్నప్పటికీ అటవీ అధికారులు ఆదివాసీలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ వారి భూములను దున్నుకోనివ్వకుండా ఆదివాసీలపై జులుం ప్రదర్శిస్తున్నారని ఆదివాసీ హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్మ పున్నం కోటపల్లి మండలం సూపాక గ్రామంలో ఏర్పాటు చేసిన ఆదివాసీల సమావేశంలో పేర్కొన్నారు. ఆదివాసీలపై కక్షగట్టి భూములను దున్నడానికి వెళ్తున్న ఆదివాసీల పనిముట్లను వారి వాహనాలను సైతం తీసుకెళ్తుండగా, పట్టాలు ఉన్నప్పటికీ పోడు భూములు బీడు భారుస్తూ కోటపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి రవికుమార్ ఆదివాసీలకు ఆవేదన మిగులుస్తున్నారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. పోడు రైతులపై ఫారెస్ట్ రేంజ్ అధికారి రవికుమార్ మరియు అటవీ అధికారుల తీరును నిరసిస్తూ ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నాకు ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలి రావాలని, ఆదివాసీల హక్కుల సాధనకై ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పున్నం కోరారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు తలాంటి ముత్తయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు తలండి రాజేష్, కార్యదర్శి ఎలండి మల్లేష్, స్వయం సదవలి, కొడితే పుష్పలత, తలాండి మహేశ్వరి, మడే మారయ్య, అలాంటి బాపు, తలండి సత్తయ్య మరియు పౌరసాగుదారులు పాల్గొన్నారు.

## వృథా అవుతున్న మంచి నీటి సరఫరా



ఈసీఐఎల్, క్విక్ టుడే న్యూస్ : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మౌలాలి షఫీ నగర్ షాదుల్ మస్జిద్ రహదారిపై మంచినీటి పైపు పగిలి మంచినీరు వృథాగా పోతోంది. గత 3 నెలలుగా రోజు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. మంచినీటి సరఫరా మూసివేసే వరకు లక్షలాది లీటర్ల నీరు వృథాగా పోతున్న దృశ్యం పలుమార్లు ఉన్నతాధికారులకు సమస్యను వివరించిన పరిష్కరించే దిశగా ప్రయత్నించడం లేదు. కాలనీవాసులు తాగునీటి సరఫరా సరిగ్గా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ వాసులు వాటర్ వర్క్స్ బోర్డు చుట్టూ తిరిగిన ఫలితం లేదు. కాలనీలో ఇంటింటికి అందాల్సిన నీటిని ఇలా రోడ్డుపాలు అవుతున్న పట్టించుకునే నాధుడే లేడు. ఎండాకాలమే కాదు ఏ కాలమైనా సరైన మోతాదులో మంచినీటి సరఫరా అండకా కాలనీవాసులు ఎప్పుడు ఇబ్బందుల పాలే అవుతున్నారు. జిఎం డీజీఎం ఏఈ ఇలా ప్రతి ఒక్క అధికారిని కలవాని రోజు అంటూ లేదు అని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

### సంకీర్ణ ప్రభుత్వానికి

## పూర్తి సంఖ్యాబలం లేదు

### ఎన్డీఏ సర్కార్ ఏ క్షణంలోనైనా కూలిపోవచ్చు

### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖర్జున ఖర్గే జోస్యం

న్యూఢిల్లీ,జూన్15 క్విక్ టుడే న్యూస్ : ప్రధాని మోదీ సారథ్యంలో సంకీర్ణ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖర్జున ఖర్గే జోస్యం చెప్పారు. మోదీ ప్రభుత్వానికి మెజార్టీ లేదని, ఎన్డీఏ సర్కార్ పొరపాటున ఏర్పడిందని అన్నారు. మోదీ ప్రభుత్వం కూలిపోవాలని తాము కోరుకోవట్లేదని తెలిపారు. దేశానికి మంచి జరగాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. దేశాన్ని బలోపేతం చేసేందుకు కలిసికట్టుగా పనిచేయాల్సి ఉందన్నారు. కానీ.. మంచి జరగకుండా చేయటం ప్రధాని మోదీకి అలవాటు అని విమర్శించారు. దేశం మరింత బలోపేతం అవడం కోసం తాము సహకరిస్తామని ఖర్గే పేర్కొన్నారు. మోదీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి పూర్తి సంఖ్యాబలం లేదని అన్నారు. ఎన్డీఏ సర్కారు మైనార్టీ సర్కార్ అని తెలిపారు. ఇదిలా ఉంటే ఖర్గే వ్యాఖ్యలపై ఎన్డీఏ మిత్ర పక్షాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాలను గుర్తు చేస్తూ విమర్శలు గుప్పించాయి. మెజార్టీ రాకుండానే పీవీ నరసింహా రావు, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాలు నడిపించలేదా ? కాంగ్రెస్ చరిత్ర గురించి ఖర్గేకు గుర్తు లేదా అని జేడీయూ నేత ఒకరు ఎద్దేవా చేశారు.ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 293 సీట్లు సాధించింది. గతంలో రెండు సార్లు సొంతంగా మెజార్టీ మార్క్ దాటిన బీజేపీ ఈ సారి 240 సీట్లకు పరిమితం అవడంతో కాంగ్రెస్ నేతలు.. మోదీ సర్కార్ పై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇదిలా ఉంటే 1991లో కాంగ్రెస్‌కు కూడా 244 స్థానాలు దక్కగా.. మిత్ర పక్షాలతో కలిసి పీవీ నరసింహా రావు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2004లో కాంగ్రెస్ 114 స్థానాల్లో గెలుపొందగా.. మిత్ర పక్షాల అండతో మన్మోహన్ సింగ్ ప్రధాని అయ్యారు.

## త్వరలో కొత్త టూరిజం పాలసీ తెస్తాం

### కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు,జూన్15 : కర్ణాటక పరిశ్రమలోకి పెట్టుబడులను ఆకర్షించేందుకు కొత్త టూరిజం పాలసీని తీసుకురావాలని యోచిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. కర్ణాటక టూరిజం శాఖ నిర్వహించిన 'దక్షిణ్ భారత్ ఉత్సవ్' కార్యక్రమంలో డీకే.శివకుమార్ మాట్లాడుతూ.. మంచి టూరిజం పాలసీ వల్ల పారిశ్రామికవేత్తలు, పెట్టుబడులను ఆకర్షించగలుగుతామన్నారు. పారిశ్రామికవేత్తలు బాగా పనిచేసినప్పుడు.. ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. ఎక్కువ ఉద్యోగాలు సృష్టించబడతాయని.. అలాగే పరిశ్రమ కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పాండిచ్చేరి, తెలంగాణ నుంచి చాలా మంది ప్రతినిధులు ఉన్నారని తెలిపారు. వారి అనుభవాలను కర్ణాటకలో పంచుకోవాలని అభ్యర్థిస్తున్నట్లు పేర్కొన్నారు. కర్ణాటకలో 300 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని చూస్తోందన్నారు. బెంగళూరు ఐటీ రాజధానితో పాటు పర్యాటక కేంద్రంగా కూడా మారుతుందని అన్నారు. బెంగళూరులో కబ్బన్ పార్క్ మరియు లాల్ బాగ్ సంప్రదాయ పర్యాటక ప్రదేశాలు. కొత్త తరం ప్రజల కోసం కొత్త పర్యాటక ప్రదేశాలను రూపొందించడానికి బెంగళూరులో స్కై డెక్‌ని ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే 8-10 రోజుల్లో స్కై డెక్ కోసం కొత్త టెండర్లను ఆహ్వానిస్తామని చెప్పారు. డిస్నీల్యాండ్ తరహాలో బృందావన గార్డెన్‌ను కూడా అభివృద్ధి చేయాలని ప్లాన్ చేస్తున్నామన్నారు. ఇందుకోసం గత బడ్జెట్‌లో కేటాయింపులు కూడా జరిగాయని గుర్తుచేశారు. జీఎస్టీ కారణంగా పెట్టుబడులు రావడం లేదని, వ్యాపారులు మొగ్గు చూపడం లేదని డీకే.శివకుమార్ తెలిపారు.

## తమిళనాడులో అమానుష ఘటన


### కులాంతర వివాహం జరిపించారని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంపై దాడి

తిరునెల్వేలి,జూన్15 : కులాంతర వివాహం జరిపించిన సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంపై అమ్మాయి కుటుంబ సభ్యులు దాడి చేశారు. ఈ ఘటన తమిళనాడులోని తిరునెల్వేలిలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా %-% మార్క్సిస్ట్ కార్యాలయంలో చోటు చేసుకుంది. జూన్ 13వ తేదీన వివాహం చేసుకున్న వివిధ కులాలకు చెందిన యువ జంటకు మార్క్సిస్ట్ పార్టీ మద్దతు ఇవ్వడాన్ని అమ్మాయి కుటుంబ సభ్యులు వ్యతిరేకించారు. ఈ క్రమంలో.. పార్టీ కార్యాలయంతో పాటు, ఇద్దరు కార్యకర్తలపై దాడి చేశారు. కాగా.. ఈ ఘటనకు సంబంధించి 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కులాంతర వివాహం చేయడానికి పార్టీ సహాయం చేసినందున, తిరునెల్వేలిలోని పార్టీ కార్యాలయాన్ని కొంతమంది అగ్రవర్ణాల వ్యక్తులు శుక్రవారం ధ్వంసం చేశారని సీపీఐ(ఎం) తమిళనాడు విభాగం ఆరోపించింది. పార్టీ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, మదన్ కుమార్ (28), ఉదయ దాక్షాయిణి (23) అనే నూతన వధువరులు.. జూన్ 13న సీపీఐ(ఎం), అంటరానితనం నిర్మూలన ఫ్రంట్ సహాయంతో ఇంటి నుండి పారిపోయి వచ్చి వివాహం చేసుకున్నారు. అమ్మాయి దాక్షాయిణి అగ్రవర్ణానికి చెందినది కాగా.. మదన్ ఎస్సీ వర్గానికి చెందినవాడు. శుక్రవారం తమ వివాహాన్ని రిజిస్టర్ చేసుకునేందుకు దంపతులు రిజిస్ట్రార్ కార్యాలయంలో అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. అయితే దాక్షాయిణి కుటుంబ సభ్యులు వివాహాన్ని నమోదు చేయకుండా ఆపడానికి ప్రయత్నించారు. దీంతో.. దంపతులు స్థానిక సీపీఐ(ఎం) యూనిట్‌ను ఆశ్రయించారు. ఈ క్రమంలో.. 25 మందికి పైగా దాక్షాయిణి కుటుంబ సభ్యులు జిల్లా కమిటీ కార్యాలయంలోకి చొరబడి ఫర్నీచర్‌తో సహా పలు వస్తువులను ధ్వంసం చేశారు. విధ్వంసాన్ని ఆపడానికి ప్రయత్నించిన ఇద్దరు పార్టీ కార్యకర్తలపై దాడి చేశారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తెలిపారు. తిరునెల్వేలికి చెందిన సీనియర్ పోలీసు అధికారి మీడియాతో మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులతో సమస్యను పరిష్కరించడానికి సీపీఐ(ఎం) స్థానిక యూనిట్ ప్రయత్నించిందని తెలిపారు. అయినప్పటికీ దాక్షాయిణి కుటుంబ సభ్యులు పార్టీ కార్యాలయానికి వెళ్లి ఫర్నీచర్ ధ్వంసం చేశారని తెలిపారు. కాగా.. ఈ ఘటనపై సమాచారం అందుకుని.. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దాక్షాయిణి తల్లిదండ్రులతో సహా 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

# జాబ్ మేళాకు విశేష స్పందన

### ఇకపై ప్రతినెల జాబ్ మేళా

### ఉపాధి కల్పనాధికారి విజేత




భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో జూన్ 15(క్విక్ టుడే): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధి కల్పనాధికారిణి ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఇందులో ఉపాధి కల్పించే అపోలో ఫార్మసీ, సాయి అంజనా మోటార్స్ కంపెనీలు పాల్గొన్నాయి. ఈ జాబ్ మేళాలో మొత్తం 220 మంది అభ్యర్థులు పాల్గొనగా వారిలో 102 మంది అభ్యర్థులు సెలెక్ట్ అయ్యారు. వీరిలో 92 మంది అపోలో ఫార్మసీకి, మిగతా10 మంది సాయి అంజనా మోటార్స్ కి సెలెక్ట్ అయ్యారు. సెలెక్ట్ అయిన వారికి వెంటనే నియామక పత్రాలు అందించారు. సందర్భంగా ఉపాధి కల్పనాధికారిణి విజేత






మాట్లాడుతూ చాలాకాలం తర్వాత జాబ్ మేళా నిర్వహించడంతో దీనికి అభ్యర్థులు భారీగా హాజరు కావడం ఎక్కువ మంది ఉద్యోగాలు పొందడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ఎన్నికల కోడ్ సందర్భంగా చాలా విరామ తర్వాత జాబ్ మేళా ఏర్పాటు చేయడం జరిగిందని అయినప్పటికీ అభ్యర్థులు ఉత్సాహంగా పాల్గొని సద్వినియోగం చేసుకోవడం జరిగిందన్నారు. ఇకపై ప్రతి నెల జాబ్ మేళా ఏర్పాటు చేసి అందరికీ ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తానని ఉపాధి కల్పన అధికారిని విజేత పేర్కొన్నారు.

### ఆరేండ్ల చిన్నారిపై జరిగిన సంఘటనకు నిరసనగా

# సుందరశాలలో కొవ్వొత్తుల ర్యాలీ

### నిందితుడిని కఠినంగా శిక్షించాలి

### చెన్నూరు యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాడి రాజేందర్



చెన్నూర్, జూన్ 15. క్విక్ టుడే న్యూస్ : చిన్నారి సహస్ర ఆరేండ్ల పాప పై అత్యాచారానికి పాల్పడ్డ మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి. చెన్నూర్ మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి రాజేందర్ మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో అర్ధరాత్రి ఆరేండ్ల పసిబిడ్డ పై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన సంఘటన నాకు తీవ్రంగా బాధ కలిగించింది.ఈ దాడిని ఖండిస్తూ చెన్నూరు మండలం సుందరశాలలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది.పసిపాప కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులకు విన్నవించడం జరిగింది.ఈ సమాజంలో ఇలాంటి దారుణమైన సంఘటనలు మానవత్వానికి సిగ్గుచేటు.పసిబిడ్డల ప్రాణం తీసే ఉన్మాద ఆలోచనలకు మన సమాజంలో చోటు లేదు.ఇంత దారుణానికి పాల్పడిన మానవ మృగాన్ని, కామాంధుడు ఉత్తరప్రదేశ్ కు చెందిన బలరాం ను పోలీసులు అరెస్టు చేసి దారుణంగా శిక్షించాలి. బహిరంగంగా ఉరితీయాలి, అని పోలీస్ వారిని కోరడం జరిగింది. ఇలాంటి ఘటన మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మేడ రాజు, రజనీకాంత్,రాజకుమార్ సంపత్,రాజు,శంకర్, కిరణ్,కుమార్, సతీష్, వినయ్, సురేష్, రజినీకాంత్, రోహిత్, శశికాంత్, శ్రీకాంత్, మల్లేష్, విజయ్, రాజేష్, అంజి, దుర్గం శంకర్, మరియు సుందరశాల గ్రామ యూత్ పెద్ద ఎత్తున పాల్గొని చిన్నారి సహస్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు.

# శ్రీ రాగా ప్లే స్కూల్ లో ఫాదర్స్ డే






కొత్తగూడెం జూన్ 15, క్విక్ టు డే న్యూస్ : కొత్తగూడెం మెదరాస్తి లో గల శ్రీ రాగా ప్లే స్కూల్ లో ఫాదర్స్ డే ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రాగా స్కూల్ కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే ఆ పిల్లల సంరక్షణ, ఆలన పాలన గురించి ఎక్కువగా తండ్రే చూసుకుంటారని అన్నారు. అలాగే తన చేతుల మీద పెరిగిన పిల్లలను ఒక వయస్సు వచ్చేదాకా పిల్లలను కంటికి రెప్పలా కాపాడుతూ అనుక్షణం డేగల కాపలా కాస్తాడని అన్నారు. అలాంటి తండ్రి కి పిల్లలు సంతోష పెట్టడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని విద్యార్థినీ విద్యార్థులను కోరారు. అలాగే జన్మనిచ్చిన తల్లిదండ్రులను పెట్టకుండా సంతోషంగా చూసుకోవాలనే ఉద్దేశంతో సంవత్సరంలో ఒకరోజు తండ్రి యొక్క పాత్ర గురించి తెలుసుకోవడం లో భాగంగా ఫాదర్స్ డే కార్యక్రమం ఎంచుకోవడం కోసం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ లో చిన్నారుల నాన్న లను పిలిపించి పిల్లలతో గ్రీటింగులు ఇప్పించి చిట్టి పొట్టి చేతులతో తండ్రి నుదుటిపై ముద్దులు పెట్టించి కానుకగా ప్రతి ఒక్కరూ నాన్న లకు పెన్నులు మరియు కళ్లద్దాలు ఇప్పించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం లో స్కూల్ డైరెక్టర్ కవిత ఉపాధ్యాయులు రాంబాబు, సంధ్య, యాస్మిన్,కౌసార్, ,జ్యోతి, సర్వేశ్వర రావు,రాంసింగ్,సురేష్ కుమార్, చైతన్య, అనుష పాల్గొన్నారు.

టైమ్ టుడే
The New Generation Telugu Daily
బుధవారం 12 జూన్ 2024
మేడ్చల్
MEDCHAL

## వం తాల
# ప్రాలి

మేయర్ జక్క

## భా లో
# పా డ్డి

మేయర్ జక్క